
చాంద్రాయణగుట్టలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు


దుర్గానగర్ భారత అభ్యుదయ పాఠశాలలో..


శాంతినగర్ శ్లోకా స్కూల్‌లో..

పోలింగ్ ప్రశాంతం

- పటిష్ట బందోబస్తు నడుమ ఓటు వేసిన ఓటర్లు
- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు
- పాతబస్తీలో తగ్గిన ఓటింగ్ శాతం

చార్మినార్: చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురాలో చెదురుముదురు సంఘటనలు మినహా.. గురువారం పాతబస్తీలో పోలింగ్ సజావుగా కొనసాగింది. బోగస్ ఓటింగ్‌కు ప్రయత్నించిన కొంత మందిపై కేసులు నమోదు చేసినట్లు దక్షిణ మండలం డీసీపీ తెలిపారు. చార్మినార్, బహదూర్‌పురాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మజ్లిస్ పార్టీ కార్యకర్తలకు నడుమ ఘర్షణ వాతావరణం కొనసాగింది. ఇక యాకుత్‌పురాలో మజ్లిస్ వర్సెస్ ఎంబీటీ నడుమ వాగ్వాదాలు కొనసాగాయి. నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్యతో పాటు దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయి చైతన్య పాతబస్తీలో పర్యటించి ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ప్రతి పోలింగ్ కేంద్రలో సీసీ టీవీలు ఏర్పాటు చేయడంతో బోగస్ ఓటింగ్ చాలా వరకు తగ్గింది.

కనిపించని పోలింగ్ ఏజెంట్లు..

చాలా పోలింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్స్ కనిపించ లేదు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో కేవలం మజ్లిస్ పార్టీ ఏజెంట్లు మాత్రమే కనిపించారు. చార్మినార్ నియోజకవర్గంలో అక్కడక్కడ బీఆర్ఎస్, బీజేపీ పార్టీ అభ్యర్థుల జాడే కనిపించ లేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీసులు ముందే ప్రకటించినట్లు.. భారీ బందోబస్తుతో ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేసి ఎక్కడైతే పోలీసుల అవసరం ఉందో అక్కడ క్షణాల్లో వచ్చి పరిస్థితులను చక్కదిద్దారు.

ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్న పాతబస్తీ ఓటర్లు..

గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ కొద్దిగా మందకొడిగా సాగినప్పటికీ..మధ్యాహ్నం నుంచి పుంజుకుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 10 గంటల వరకు మందకొడిగా సాగింది. ఒకరు.. ఇద్దరు చొప్పున మాత్రమే పోలింగ్ స్టేషన్లకు వెళ్లిన ఓటర్లు మధ్యాహ్నం నుంచి పుంజుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో ఓటర్లు పోలింగ్ స్టేషన్ల వద్ద బారులు తీరినప్పటికీ.. పోలింగ్ శాతం అనూహ్యంగా తగ్గిపోయింది.


శాలిబండలో క్యూలో నిల్చున్న ఓటర్లు

నాంపల్లిలో..

నాంపల్లి: నియోజకవర్గంలో చెదురుముదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. విజయనగర్‌కాలనీ రవీంద్ర భారతి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్–27లో ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇక్కడ 8.30 గంటలకు ఓటర్లను ఓటింగ్ వేసేందుకు అనుమతించారు. అలాగే 120, 121 పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగిందనే ప్రచారం జరిగింది. దీంతో అక్కడకు కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ చేరుకోవడంతో ఆయన వెంటే ఎంఐఎం ఏజెంట్లు, కార్యకర్తలు వెంబడించడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. అలాగే 78, 79 పోలింగ్ కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఎదురైంది. పోలీసులు రంగప్రవేశం చేసి లాఠీచార్జి చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఎంఐఎం అభ్యర్థి మహ్మద్ మాజిద్ హుస్సేన్‌ను ఓటర్లను ప్రభావితం చేసేందుకు యత్నించారన్న కారణంతో హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి విడుదల చేశారు. ఎంఐఎం జనరల్ ఏజెంట్, హైదరాబాద్ ఎంపీ ముస్తాక్ హబీబ్‌నగర్‌లో ఎంఐఎం నేతలు, కార్యకర్తలతో కలిసి హల్చల్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. హుమయూన్‌నగర్‌లోని 44, 45, 46, 47 పోలింగ్ బూత్‌లను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ సందర్శించి ఎన్నికల సరళిని పరీక్షించారు. నాంపల్లిలో 2018 సాధారణ ఎన్నికల పోలింగ్ సరళిని గమనిస్తే 2023 నవంబరు 30న జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం బాగా తగ్గింది. 2018లో పోలింగ్ ముగిసే సమయానికి 49 శాతం పోలవగా ఈసారి ఎన్నికలు ముగిసేసరికి 32.4 శాతానికి పడిపోయింది.

గోషామహల్‌లో..

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చిన్న చిన్న తగాదాలు తప్పా పోలింగ్ సాయంత్రం మధ్యాహ్నం వరకు మందకోడిగా ఉండి సాయంత్రం పెరిగింది. నియోజకవర్గంలోని 235 పోలింగ్ స్టేషన్‌లో దాదాపు 48 శాతం ఓట్లు పోలయ్యాయి. ఉత్తర భారతీయులు బస్తీలు, మురికి వాడల్లో పోలింగ్ శాతం తగ్గగా మైనార్టీలు నివసించే ప్రాంతంలో పోలింగ్ శాతం పెరిగింది. సాయంత్రం 5 దాటినా మైనార్టీలు ఉండే పోలింగ్‌బూత్‌లలో ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి చూపారు.

మొరాయించిన ఈవీఎంలు..

గోషామహల్ టీటీఐ పోలింగ్‌బూత్‌తో పాటు ఎగ్జిబిషన్ గ్రౌండ్, అజంతా గేటు వద్ద ఉన్న పోలింగ్‌బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు తర్వాత మొరాయించిన ఈవీఎంల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు.

48 శాతం పోలింగ్..

సాయంత్రం 5.30 గంటల వరకు 48 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఎగ్జిబిషన్ అజంతాగేట్, గోషామహల్, మంగళ్‌హాట్, ధూల్‌పేట్ ప్రాంతాల్లో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పంపించారు. ఫీల్‌ఖానాలో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జియాగూడలో..

జియాగూడ: జియాగూడలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దుర్గానగర్‌లో గల భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో 22వ పోలింగ్‌బూత్, విద్యశ్రీ స్కూల్‌లో గల 24వ పోలింగ్ బూత్, నలందలో గల 35 పోలింగ్ బూత్‌లలో ఉన్న ఈవీఎంలు మొరాయించాయి. దీంతో సుమారు గంటన్నర పాటు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. భారత అభ్యుదయ పాఠశాలల, శ్లోకా స్కూళ్లల్లో 5 దాటినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు.

చాంద్రాయణగుట్టలో..

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా కొనసాగింది. ఎన్నికల అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా పోలింగ్ శాతం గత ఎన్నికల కంటే నాలుగు శాతం తక్కువగానే నమోదయ్యింది. దాదాపుగా 40 శాతం నమోదయ్యిందని రిటరిన్లింగ్ అధికారి సూర్యప్రకాష్ తెలిపారు. ఉదయం 10 గంటల వరకు కూడా పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక చాలా వరకు బోసిపోయి కనిపించాయి. ఉప్పుగూడ, లలితాబాగ్, జంగమ్మెట్ డివిజన్లలో కాస్త పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైనప్పటికీ...చాంద్రాయణగుట్ట, కంచన్‌బాగ్, రియాసత్‌నగర్, బార్కాస్ డివిజన్లలో మాత్రం పోలింగ్ మందకొడిగా కొనసాగింది. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.

కార్వాన్ నియోజకవర్గంలో..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీల నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ హకీంపేట్‌లోని పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా గుడిమల్కాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు టి.జీవన్‌సింగ్, బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్‌లు తమతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎంలు..

కార్వాన్ నియోజకవర్గంలో టోలిచౌకీ, గోల్కొండతో పాటు కార్వాన్ తదితర డివిజన్లలోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. గోల్కొండ డివిజన్‌లోని 177 పోలింగ్ బూత్‌లో ఉదయం 8 గంటల వరకు పోలింగ్ ప్రారంభం కాలేదు. 7 గంటలకే ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ గేటు వద్దకు వచ్చారు. అయితే ఈవీఎం మిషన్ మొరాయించడంతో గంట సేపు ఓటర్లు వేచి ఉండాల్సి వచ్చింది. అదే విధంగా టోలిచౌకీ, నానల్‌నగర్, కార్వాన్ డివిజన్‌లలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఈవీఎంలు అరగంట సేపు మొరాయించాయి.

పాతబస్తీలో తగ్గిన పోలింగ్

చార్మినార్: పాతబస్తీలో ఈసారి అతి తక్కువ పోలింగ్ నమోదయ్యింది. చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా తదితర శాసనసభ నియోజకవర్గాల్లో 2009, 2014, 2018లలో కన్నా తక్కువ పోలింగ్ శాతం నమోదయ్యింది. ఈ ఎన్నికల్లో చార్మినార్‌లో 41.45శాతం, యాకుత్‌పురా 29.04 శాతం, చాంద్రాయణగుట్టలలో 40 శాతం, బహదూర్‌పురాలో 45.11శాతం పోలింగ్ నమోదయ్యింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం బాగా తగ్గింది. ఈ తగ్గిన పోలింగ్ ఫలితం ఎవరి ఖాతాలోకి వెళ్తుందోనని అటు పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు ఓటర్లలో ఆసక్తిని కలిగిస్తుంది. ఈసారి తక్కువగా నమోదైన పోలింగ్ ఎవరికి మేలు చేస్తుందో ఈనెల 3న జరిగే కౌంటింగ్‌లో తేలనుంది.

2018లో..

2018 ఎన్నికల్లో చార్మినార్‌లో 50 శాతం, యాకుత్‌పురా 45 శాతం, చాంద్రాయణగుట్టలలో 45 శాతం, బహదూర్‌పురాలో 49.29 శాతం పోలింగ్ నమోదైంది. 2009,2014 ఎన్నికల్లో నమోదైన పోలింగ్‌తో చూస్తే.. 2008లో తక్కువగా నమోదయ్యింది.

2014లో..

2014 ఎన్నికలలో చార్మినార్‌లో 54 శాతం, యాకుత్‌పురా 52 శాతం, చాంద్రాయణగుట్టలలో 52 శాతం, బహదూర్‌పురాలో 55.91 శాతం పోలింగ్ నమోదయ్యింది.

కాంగ్రెస్ కార్యకర్తలపై మజ్లిస్ దాడి

- క్షతగాత్రులను ఉస్మానియాకు తరలింపు
- మజ్లిస్ కార్పొరేటర్‌తో పాటు పలువురిపై కేసు నమోదు



చార్మినార్: ఈసారి జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేసినట్లు కనిపించింది. చార్మినార్ నియోజకవర్గంలో మజ్లిస్ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను చితకబాదారు. చార్మినార్ నియోజకవర్గంలోని 22, 23 పోలింగ్ స్టేషన్ల వద్ద మజ్లిస్–కాంగ్రెస్ కార్యకర్తలకు ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముగ్గురు తీవ్ర గాయాలకు గురి కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బోగస్ ఓట్లను అడ్డుకున్నందుకే తమ కార్యకర్తలపై మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీతో పాటు పలువురు కార్యకర్తలు తమ కార్యకర్తలను చితకబాదారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ ముజీబుల్లా షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్‌తో పాటు కార్యకర్తలపై మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ దాడికి పాల్పడడంతో ఆ కార్పొరేటర్‌పై కేసులు నమోదయ్యాయని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు.

అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లోకి..

కార్పొరేటర్‌పై కేసు

బహదూర్‌పురా: పోలింగ్ బూత్‌లోకి అనుమతి లేకుండా వెళ్లేందుకు ప్రయత్నించిన కిషన్‌బాగ్ కార్పొరేటర్ మహ్మద్ హుస్సేనీ పాషాను బహదూర్‌పురా పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కిషన్‌బాగ్ ఓ కిండర్ స్కూల్‌లో మహ్మద్ హుస్సేనీ పాషా అనుమతి లేకుండా పోలింగ్ బూత్‌లోకి వెళ్లాడు. పోలింగ్ బూత్‌లోకి రావడంపై అధికారులు, పోలీసులు అభ్యంతరం తెలపడంతో కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు.

నేటి నుంచి నీటి సరఫరాలో అంతరాయం

బహదూర్‌పురా: ఆరాంఘర్ నుంచి జూపార్కు రహదారిలో వాటర్ వర్క్స్ పైప్‌లైన్ మరమ్మతు పనుల కారణంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మిశ్రీగంజ్ సెక్షన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మహ్మద్ హకీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మిశ్రీగంజ్, పత్తర్‌గట్టి, దూద్‌బౌలి సెక్షన్‌లలోని మూసాబౌలి, ముర్గీచౌక్, మదీనా, చెలాపురా, రికాబ్‌గంజ్, లాడ్‌బజార్, పేట్లబురుజు, గులాబ్‌సింగ్ బౌలి, షక్కర్ కోట్, హుస్సేనీఆలం, చోటాబజార్, ఖబూతర్‌ఖానా, ఎస్‌వీనగర్, జలాల్‌కుంచె, షాగంజ్, బారాగల్లీ, కాలికబర్, ఆషూర్‌ఖానా గల్లీ, బూస్టర్ గల్లీ ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.


నిర్మానుష్యంగా మారిన టోలిచౌకీ ఫ్లై ఓవర్

ప్రధాన రహదారులు, ఫ్లై ఓవర్లు నిర్మానుష్యం

గోల్కొండ: తెలంగాణ అసెంబ్లీకి గురువారం జరిగిన ఎన్నికలతో షాపులు తెరుచుకోలేదు. మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో రెస్టారెంట్లు, షాపులు, ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మూసి ఉన్నాయి. దీంతో ప్రధాన రహదారులు బోసిగా కనిపించాయి. టోలిచౌకీలోని ఫ్లై ఓవర్ దాదాపు నిర్మానుష్యంగా మారింది. మెహిదీపట్నం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా వాహనాల రాకపోకలు తక్కువగా ఉన్నాయి. మాసబ్‌ట్యాంక్, షేక్‌పేట్‌ల ఫ్లై ఓవర్లపై సైతం అరకొర వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించాయి. ప్రయాణికులతో కిటకిటలాడే మెహిదీపట్నం, షేక్‌పేట్ నాలా, నానల్‌నగర్ బస్టాప్‌ల వద్ద ఒకరిద్దరు ప్రయాణికులు మాత్రమే కానవచ్చారు.


హబీబ్‌నగర్‌లో.. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్


అశోక్‌విహార్‌లో.. రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు అరుణ్‌కుమార్


వీవీ కన్నికబూత్‌లో.. బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్


గోషామహల్‌లో బుల్లెట్‌పై బీజేపీ అభ్యర్థి రాజాసింగ్


ఫీల్‌ఖానాలో..బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్



గుడిమల్కాపూర్‌లో.. బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్


రాజేశ్వర్‌రావు, దీపేష్‌రాజ్ వర్మ కుటుంబసభ్యులు


సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి


హుమయూన్ నగర్‌లో పర్యటించిన రోనాల్డ్ రాస్


కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్


హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌తో.. ఎంపీ పీఏ ముస్తాక్


ఉర్దూ కళాశాల బూత్‌లో.. శాంతిదేవి తదితరులు


ఎంబీటీ నాయకుడు బుంగ శివకుమార్ దంపతులు


ఓటు వేసిన గాజుల అంజయ్య దంపతులు



గుడిమల్కాపూర్‌లో.. బీఆర్ఎస్ నాయకుడు జీవన్‌సింగ్


జనగామ మధుసూదన్ గౌడ్ దంపతులు


టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి


గుడిమల్కాపూర్‌లో..బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్



జాంబాగ్ డివిజన్‌లో.. కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్


హనుమాన్ వ్యాయామశాలలో.. వికలాంగుడు త్రిమూర్తి పిళ్లై


గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి



మొదటిసారి ఓటేసిన వట్టిపల్లే ప్రణీత్


ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్


కార్వాన్‌లో.. బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ


బహదూర్‌పురా కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్ కుమార్


హకీంపేట్‌లో.. మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్


చాంద్రాయణగుట్ట బీఆర్ఎస్ అభ్యర్థి సీతారాంరెడ్డి


గన్‌ఫౌండ్రీలో.. మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్‌గుప్తా


వంద ఏళ్ల వృద్ధుడితో .. డీవీఎస్ రాజు